

దోలీ మోతలకు పరిష్కారమెన్నడో?

ఐదేళ్లలో రోడ్ల నిర్మాణాలపై దృష్టిపెట్టని వైసీపీ సర్కారు

- సగానికిపైగా పల్లెలకు రోడ్డు లేని దుస్థితి
- ఏజెన్సీలో పల్లెలు 3,915
- పక్కా రోడ్డు లేనివి 2,191
- నేటికీ మారుమూల ప్రాంతాలకు కాలినడకనే రాకపోకలు
- రోడ్లపై కూటమి సర్కారు ప్రత్యేక దృష్టి

(ఆంధ్రజ్యోతి-పాడేరు)

ఏజెన్సీ ప్రాంతంలో నేటికీ అనేక గ్రామాలకు రోడ్డు, రవాణా సదుపాయాలు లేని కారణంగా గిరిజనులకు రవాణాపరంగా అవస్థలు తప్పడం లేదు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రోడ్ల నిర్మాణంపై కనీస దృష్టి సారించకపోవడంతో నేటికీ మారుమూల ప్రాంత వాసులు కాలినడకనే గమ్యం చేరాల్సిన దుస్థితి కొనసాగుతున్నది. అయితే గిరిజన ప్రాంతాల్లో రోడ్డు, రవాణా సదుపాయాలకు పెద్దపీట వేస్తామని, డోలి మోతల రహితం చేస్తామని కూటమి ప్రభుత్వం పేర్కొనడంతో భవిష్యత్తుపై గిరిజనులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

2,191 గ్రామాలకు పక్కా రోడ్డు లేని పరిస్థితి

ఏజెన్సీ 11 మండలాల్లో 244 గ్రామ పంచాయతీల పరిధిలో 3,915 గిరిజన గ్రామాలుండగా.. వాటిలో 1,724 గ్రామాలకు మాత్రమే పక్కా తారు రోడ్డు సదుపాయం ఉంది. మిలిగిన 2,191 గ్రామాలకు పక్కా రోడ్డు సదుపాయం లేదు. దీంతో మారుమూల ప్రాంతాల్లోని గిరిజనులు కొండలు, కోనలు, వాగులు, వంకలు దాటుకుంటూ బాహ్య ప్రపంచానికి చేరుకుంటున్నారు. మామూలుగా అయితే కాలినడకన గిరిజనులు ఎంత దూరమైన రాకపోకలు సాగిస్తారు. కాని అనారోగ్య సమస్యలు, గర్భిణులకు పురిటి నొప్పులు వచ్చినపుడు వారి అవస్థలు అన్నీఇన్నీ కావు. రోగులు, గర్భిణులను డోలీల్లో కొండ కోనల్లోంచి పదుల కిలోమీటర్లు మోసుకు వచ్చి రోడ్డున్న ప్రాంతాలకు చేరుకుని, అక్కడి నుంచి అంబులెన్స్‌ల్లో ఆస్పత్రులకు చేరుకుంటున్నారు. ఈ ప్రయాణంలో రోగులు, గర్భిణులు పరిస్థితులు విషమిస్తే అంతే ... మిగతా 8వ పేజీలో


ఏజెన్సీలో రోడ్డులేని ప్రాంతాల్లో గిరిజనుల డోలీ మోత(ఫైల్)


ఏజెన్సీలో రోడ్డు లేని గిరి పల్లెకు నడుచుకుంటూ వెళుతున్న గిరిజనులు

ఆదివాసీలకు ఎన్నాళ్లీ కష్టాలు

ప్రాణం నిలబెట్టేందుకు సాహసం

- జ్వర బాధితురాలిని భుజాలపై గెడ్డ దాటింపు
- డోలిపై ఎనిమిది కిలోమీటర్లు మోసుకుంటూ ముంచంగిపుట్ట ఆస్పత్రికి తరలింపు
- వైద్య సేవలందడంతో నిలకడగా ఆరోగ్యం
- మరోచోట గర్భిణిని రెండు కిలోమీటర్లు డోలిపై ఆస్పత్రికి తీసుకువచ్చిన కుటుంబీకులు
- లబ్బూరులో వైద్య సేవలు పొందుతున్న గర్భిణి
- మారుమూల లక్ష్మీపురం పంచాయతీకి చెందిన గిరిజనుల అవస్థలు


జ్వర బాధితురాలిని భుజాలపై మోసుకుంటూ ఉబ్బెంగుల గెడ్డ దాటిస్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు, ఆగస్టు 2:
మండలంలో అతి మారుమూల గ్రామం. ఒక ప్రాణాన్ని నిలబెట్టేందుకు ఆ గ్రామస్థులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సాహసం చేశారు. సుమారు ఎనిమిది కిలోమీటర్లు కాలినడకన, కొండ కోనలు, గెడ్డలు దాటుతూ బాధిత మహిళను పల్లకి సాయంతో.. భుజాలపై మోసుకుంటూ ఆస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే..

మండలంలోని మారుమూల లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ గ్రామానికి చెందిన వంతాల పొర్తిమ (46) గత మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. శుక్రవారం ఆమె పరిస్థితి విషమంగా మారింది. అయితే ... మిగతా 8వ పేజీలో

బొత్స ఎంపికపై గరంగరం



స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా పొరుగు జిల్లా నేతను ఎంపిక చేయడంపై ఉమ్మడి జిల్లా వైసీపీ నేతల్లో తీవ్ర అసంతృప్తి

- పక్క జిల్లా నాయకుడిని తీసుకువచ్చి పోటీ చేయించాల్సిన అవసరమేమిటంటూ ఆగ్రహం
- ఉమ్మడి జిల్లాలో నాయకులే లేరా...అంటూ ప్రశ్నలు
- మొన్న ఆయన భార్యకు ఎంపీ సీటు... ఇప్పుడు ఆయనకు ఎమ్మెల్సీ సీటు
- ఎన్నిక అనివార్యమైతే బొత్స విజయం కోసం ఎంతమంది మనస్ఫూర్తిగా పనిచేస్తారనేది అనుమానమే...

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా విజయనగరం జిల్లాకు చెందిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను ఖరారు చేయడంపై వైసీపీ తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. పార్టీ నుంచి వంశీకృష్ణ శ్రీనివాస్ బయటకు వెళ్లిపోవడంతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానం కోసం ఎంతోమంది కాచుకు కూర్చున్నారు. సాధారణ ఎన్నికల్లో అవకాశం కల్పించలేకపోయిన వారికి ఇస్తారని కోలా గురువులు వంటి నాయకులు ఆశలు పెట్టుకున్నారు. అయితే ఊహించని విధంగా పార్టీ అభ్యర్థులంతా ఓడిపోవడంతో అందరి కళ్లు శాసన మండలిపై పడ్డాయి. ఎలాగైనా అధికారంలో కొనసాగాలనే తాపత్రయంతో మొన్నటివరకు అధికారం అనుభవించిన వారంతా ఈ ఎమ్మెల్సీ టికెట్‌ను ఆశించారు. కానీ ఊహించని విధంగా పక్క జిల్లా నాయకుడు బొత్సను అభ్యర్థిగా ప్రకటించడంతో అంతా కంగుతిన్నారు.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను పోటీకి దింపుతున్నట్టు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఇటీవల సాధారణ ఎన్నికల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో పోటీ చేసిన ఎమ్మెల్యే అభ్యర్థులతో అమరావతిలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అందరి అభిప్రాయాలు తెలుకున్నాక, బొత్సను అభ్యర్థిగా ఖరారు చేస్తున్నట్టు ప్రకటించారు. అంతా నవ్వు ముఖాలు పెట్టినా లోలోపల మాత్రం కుతకుతలాడిపోతున్నారు. పొరుగు జిల్లాకు చెందిన నాయకుడిని తీసుకువచ్చి ఇక్కడ పోటీకి దింపడం ఏమిటంటూ రుసరుసలలాడుతున్నారు. అసలు...ఈ టికెట్ బొత్సకు ఇస్తారని ఎవరూ ఊహించలేదు. ఆయన పోటీలో ఉన్నారనే విషయం కూడా ఎక్కడా బయటకు పొక్కలేదు. వాస్తవానికి ఈ ఎన్నికల్లో ఓట్లు వేసేది ఉమ్మడి విశాఖ జిల్లాలోని స్థానిక సంస్థల ప్రతినిధులు మాత్రమే. అన్ని పార్టీలకు కలిపి మొత్తం 822 మంది ఉన్నారు. రెండున్నరేళ్ల క్రితం ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగినప్పుడు రెండు స్థానాలకు వైసీపీ తరపున వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కళ్యాణిలను పోటీకి దింపారు. అప్పుడు కూడా కళ్యాణి అభ్యర్థిత్వంపై పలువురు అసంతృప్తి వ్యక్తంచేశారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆమెకు ఇక్కడ ఎలా అవకాశం ఇస్తారని ప్రశ్నించారు. అంతకు ముందు ఎన్నికల్లో ఆమె అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గంలో పార్టీ తరఫున పనిచేశారని పార్టీ సర్ది చెప్పింది. దాంతో నాయకులు సరిపెట్టుకున్నారు. ఇప్పుడు మళ్లీ అదే కోటా సీటు ఖాళీ అయితే జిల్లాలో నాయకులు ఎంతోమంది ఉండగా...పొరుగు జిల్లాకు చెందిన బొత్సను ఎంపిక చేయడంపై తీవ్ర అసహనం వ్యక్తంచేస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో కూడా విశాఖ ఎంపీగా బొత్స భార్య ఝాన్సీలక్ష్మిని పోటీకి దింపారు. అప్పుడు ఎవరూ పెద్దగా బాధ పడలేదు. ఎవరికీ ఎంపీగా పోటీ చేసే ఆలోచన, అంత మొత్తం ఖర్చు పెట్టే ... మిగతా 8వ పేజీలో

జీకేవీధి గ్యాస్ ఆఫీస్ మూత

అధికారులు విచారణకు వస్తారనే భయంతో తాళాలు వేసిన నిర్వాహకులు

- గ్యాస్, ఈకేవైసీ కోసం ఆదివాసీలు నిరీక్షణ



మూసివేసిన గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం

గూడెంకొత్తవీధి, ఆగస్టు 2:
స్థానిక ప్రైవేటు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు కార్యాలయం, గోదాము శుక్రవారం మూసివేశారు. వినియోగదారుల నుంచి ఈకేవైసీ కోసం గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు అక్రమ వసూళ్లకు పాల్పడడంతో 'గ్యాస్ ఈకేవైసీ పేరిట దోపిడీ' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో ఉన్నతాధికారులు తనిఖీలకు వస్తారనే భయంతో గ్యాస్ కార్యాలయం, గోదాముకి తాళాలు వేసి వెళ్లిపోయారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా గోదాము, కార్యాలయాన్ని మూసివేయడంతో ఈకేవైసీ, గ్యాస్ కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఆదివాసీలు మధ్యాహ్నం వరకు నిరీక్షించి తీవ్ర నిరాశతో స్వగ్రామాలకు వెళ్లిపోయారు. ఎటువంటి సమాచారం లేకుండా మూసివేయడంపై ఆదివాసీ వినియోగదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు గ్యాస్ ఏజెన్సీని రద్దు చేసి గతంలో మాదిరిగా జీసీసీకి గ్యాస్ నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

- కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశం
- మీ కోసంలో 151 వినతులు స్వీకరణ


మీ కోసంలో ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పీవో వి.అభిషేక్

పాడేరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):
ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం ఐటీడీఏ పీవో వి.అభిషేక్, డీఆర్వో బి.పద్మావతితో కలిసిన నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల నుంచి స్వీకరించిన వినతులను వేగంగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని, మీ కోసం కార్యక్రమానికి జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు హాజరుకావాలన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న వినతులను పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. రెవెన్యూ శాఖలో 105, ఇరిగేషన్ శాఖలో 6, పంచాయతీరాజ్ 1, డ్వామా 1, గృహ నిర్మాణ శాఖ 1, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో 4, సోషల్ వెల్ఫేర్‌లో 1, బీసీ వెల్ఫేర్‌లో 1 వినతిని పరిష్కారించాల్సి ఉందన్నారు. ఆయా వినతుల పరిష్కారంలో ఎందుకు జాప్యం జరిగిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

మీ కోసంలో 151 వినతులు స్వీకరణ

ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో గిరిజనుల నుంచి అధికారులు 151 వినతులను స్వీకరించారు. ప్రముఖ సందర్శనీయ కేంద్రం బొర్రా వద్ద నిలిచిన జిప్‌లైన్ తిరిగి పునరుద్ధరించి స్థానిక సొసైటీకి నిర్వహణ బాధ్యతను అప్పగించాలని ఎంపీటీసీ సభ్యురాలు కె.అరుణ, సర్పంచ్ జన్ని అప్పారావు, బ్రో సంస్థ అధ్యక్షుడు రవి, పీసా అధ్యక్షుడు దానియేలు తదితరులు కోరారు. అరకులోయ మండలం పెదలబుడు పంచాయతీ బిస్సుంగుడ గ్రామానికి చెందిన కిల్లో చంద్రశేఖర్ పుట్టగొడుగులు పెంపకానికి రూ.3 లక్షలు రుణం మంజూరు చేయాలని కోరగా, పెదబయలు మండలం రూడకోట పంచాయతీ పెదకొండ గ్రామానికి రోడ్డును నిర్మించాలని పాంగి మన్మధరావు, పి.గణపతిరావు కోరారు. అలాగే అనంతగిరి మండలం చిలకలగెడ్డ పంచాయతీ దాసరితోట గ్రామంలో మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానికులు డి.నాగమణి, కె.సీతమ్మ తదితరులు వినతిపత్రం సమర్పించారు. ఇలా గిరిజనుల వ్యక్తిగత, సామాజిక సమస్యలపై 151 వినతులను అధికారులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు వీఎస్.ప్రభాకరరావు, వెంకటేశ్వరరావు, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ సి.జమాల్ బాషా, టీడబ్ల్యూ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్.శర్మ, డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈలు డీవీఆర్ఎం.రాజు, వేణుగోపాల్, ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, జిల్లా ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్ రావు, ట్రాన్స్‌కో ఈఈ అప్పారావు, పశుసంవర్ధక శాఖ డీడీ నరసింహులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి అందాలు చూడాలంటే ఫీట్లు చేయాల్సిందే..!

చెరువులవేనం మట్టి రోడ్డుపై జారిపోతున్న పర్యాటకులు, వాహనాలు

- తారు రోడ్డు నిర్మిస్తామని మూడేళ్లుగా మాయ చేసిన వైసీపీ నేతలు
- సమీపిస్తున్న పర్యాటక సీజన్

చింతపల్లి, ఆగస్టు 2:
ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి సమీపంలో ప్రకృతి అందాలకు నిలయమైన చెరువులవేనంకు రహదారి లేక పర్యాటకులు ఫీట్లు చేస్తున్నారు. ఆరేళ్లుగా పర్యాటకులు ఇక్కడకు వస్తున్నా కనీసం తారు రోడ్డు వేయలేని దుస్థితిలో ఐటీడీఏ అధికారులు ఉన్నారు. మూడేళ్ల క్రితం వ్యూపాయింట్‌కు ఐటీడీఏ అధికారులు కనెక్ట్ పాడేరులో భాగంగా మట్టి రోడ్డు వేశారు. ఈ రోడ్డు పూర్తికాగానే తారు రోడ్డు నిర్మిస్తామని వైసీపీ నాయకులు మూడేళ్లుగా మాయ చేశారే తప్ప రహదారి నిర్మాణం చేయలేదు. దీంతో చెరువులవేనం వెళ్లేందుకు పర్యాటకులు, ఆదివాసీలు సాహసం చేస్తున్నారు.

ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఎత్తైన కొండపై చెరువులవేనం గ్రామం ఉన్నది. ఇక్కడ వాతావరణం భిన్నంగా ఉంటుంది. శీతాకాలం మంచు మేఘాలు తాకుతూ పయనిస్తుంటాయి. వ్యూపాయింట్‌కి ఎదురుగానున్న లోయ మొత్తం మంచు దుప్పటి కప్పినట్టుగా సుందరంగా ఉంటుంది. ఈ ప్రకృతి అందాలను తొలిసారిగా 'ఆంధ్రజ్యోతి' బాహ్య ప్రపంచానికి పరిచయం చేసింది. నాటి నుంచి ప్రతి ఏడాది పర్యాటక సీజన్‌లో లంబసింగి వచ్చిన సందర్శకులు చెరువులవేనం ప్రకృతి అందాలు వీక్షించేందుకు క్యూ కడుతున్నారు. గత మూడేళ్లుగా పర్యాటకుల సంఖ్య భారీగా పెరిగిపోయింది. నవంబరు నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద పర్యాటకులతో జాతర వాతావరణం తలపిస్తుంది. పర్యాటకుల తాకిడి పెరగడంతో అరకు ఎంపీ మాధవి నిధులతో వ్యూపాయింట్, మరుగుదొడ్లు నిర్మించారు.

అధ్వానంగా చెరువులవేనం రహదారి

చెరువులవేనం రహదారి అత్యంత అధ్వానంగా తయారైంది. గతంలో ఈ గ్రామానికి వెళ్లేందుకు లంబసింగి నుంచి కాలిబాట మాత్రమే ఉండేది. మూడేళ్ల క్రితం ఉమ్మడి విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున సందర్శించి కనెక్ట్ పాడేరులో భాగంగా భీమనాపల్లి నుంచి చెరువులవేనం వరకు రూ.80లక్షలతో మెటల్ రోడ్డు మంజూరు చేశారు. నిర్మాణ బాధ్యతలు పొందిన కాంట్రాక్టర్ బండరాళ్లను బ్లాస్టింగ్ చేసి మట్టి రోడ్డు నిర్మించారు. నిధులు విడుదలలో జాప్యం కారణంగా మెటల్ వేయలేదు. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ మట్టి రోడ్డు చిన్నపాటి వర్షం కురిసినా బురదమయమైపోతున్నది. ఈ మార్గంలో ప్రయాణిస్తున్న, ప్రయాణికులు, వాహనాలు ... మిగతా 8వ పేజీలో


చెరువులవేనం వ్యూపాయింట్ (ఫైల్)


వర్షాలకు పాడైన చెరువులవేనం రహదారి

మూడు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

- నగరం నుంచి చోడవరం మిల్లులకు తరలిస్తుండగా పట్టుకున్న టాస్క్‌ఫోర్స్
- నగరంలో మూడుచోట్ల పౌర సరఫరాల శాఖ దాడులు
- అక్కయ్యపాలెం డిపోపై కేసు నమోదు

విశాఖపట్నం, ఆగస్టు 2:
నగరంలోని అక్కయ్యపాలెం నుంచి అనకాపల్లి జిల్లా చోడవరంలోని మిల్లులకు అక్రమంగా తరలిస్తున్న మూడు టన్నుల రేషన్ బియ్యాన్ని శుక్రవారం తెల్లవారుజామున ఎన్ఏడీ వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెంలో రేషన్ డిపోల్లో నిల్వ చేసిన బియ్యాన్ని మూడు ఆటోల్లో చోడవరం తరలిస్తున్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి పట్టుకుని ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో అక్కయ్యపాలెంలోని డిపో నంబరు-2పై పౌర సరఫరాల శాఖ అధికారులు దాడి చేసి రిజిస్టర్‌లో పేర్కొన్న సరకు కంటే 274 కిలోలు అదనంగా ఉన్నట్టు నిర్ధారించారు. దీంతో డిపోకు కేటాయించిన సరకు మొత్తం సీజ్ చేసి డిపో నంబరు-3కు అప్పగించారు. డిపో నంబరు-2పై 6-ఎ కేసు నమోదుచేశారు. కాగా పరదేశిపాలెం, రైల్వేన్యూ కాలనీలో వేర్వేరుగా దాడులు చేసి 970 కిలోల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. నగరంలో అక్రమంగా బియ్యం వ్యాపారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల అధికారి సూర్యప్రకాశరావు హెచ్చరించారు.

పచ్చని చెట్లు కూల్చేశారు

- రాయపుర అగ్రహారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో నేరేడు, వేప, అకేషియా చెట్లు నరికి, ముక్కలుగా కోత
- పిల్లలపై పడిపోతాయనే ఇలా చేశామని సర్పంచ్, స్కూల్ కమిటీ చైర్మన్ చెప్పినట్టు హెచ్ఎం వివరణ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎంఈవో


రాయపుర అగ్రహారం పాఠశాల ఆవరణలో నరికివేసిన చెట్లు

సబ్బవరం, ఆగస్టు 2: మండలంలోని రాయపుర అగ్రహారం గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో ఎన్నో ఏళ్లుగా ఉన్న నేరేడు, వేప, అకేషియా చెట్లను కొంతమంది యంత్రాలతో కూల్చివేశారు. అంతేకాకుండా ముక్కలు ముక్కలుగా కోసేశారు. దీనిపై స్థానికులు అందించిన సమాచారం మేరకు శుక్రవారం విలేకరులు సదరు పాఠశాలకు వెళ్లి పరిశీలించగా, కూల్చేసిన చెట్లు దర్శనమిచ్చాయి. దీనిపై పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం బి.వెంకటరెడ్డిని వివరణ కోరగా, గత మంగళవారం పాఠశాల సమయం తరువాత మండల కేంద్రం సబ్బవరంలో ఆర్‌జేడీ సమావేశానికి హాజరయ్యాయని తెలిపారు. ఆ సాయంత్రం పాఠశాల ఆవరణలో ఉన్న చెట్లు కూల్చివేశారన్నారు. సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ పిల్లల సాధుబాబు తామే చెట్లు కూల్చివేసినట్టు చెప్పారన్నారు. పిల్లలపై కూలిపోతాయన్న భయంతో ఇలా చేసినట్టు వివరించారని తెలిపారు. ఈ విషయాన్ని ఎంఈవో లక్ష్మణరావు దృష్టికి తీసుకు వెళ్లినట్టు చెప్పారు. విలేకరులు ఆయనను వివరణ కోరగా, ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కాగా విలువైన నేరేడు, వేప, అకేషియా చెట్లను సర్పంచ్, స్కూల్ కమిటీ చైర్మన్ అమ్మేసుకునేందుకే నరికేశారని పలువురు గ్రామస్థులు ఆరోపించారు. వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ల అందజేత

బుచ్చెయ్యపేట, ఆగస్టు 2: వివిధ ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందుతున్న పింఛనుదారులకు సైతం సచివాలయాల ఉద్యోగులు నగదు పంపిణీ చేశారు. కేజీహెచ్, అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పొలేపల్లికి చెందిన సీతా వెంకట శ్రీరామూర్తి, యండపల్లి కన్నయ్యమ్మ, కాళ్ల గణేష్మ, మూర్తి రమణ, మల్లోత్రి మాణిక్యం తదితరులకు శుక్రవారం పింఛన్ నగదు పంపిణీ చేశారు. మొత్తం 99 శాతం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో వెంకటాచార్యులు తెలిపారు.

నిండు గర్భిణికి తప్పని డోలి మోత

పాడేరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నిండు గర్భిణిని సుమారుగా రెండు కిలోమీటర్లు డోలిలో మోయాల్సిన ఘటన మండలంలో ఇరడాపల్లి పంచాయతీ డి.సంపాల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. డి.సంపాల గ్రామానికి చెందిన గర్భిణి పాంగి చినతల్లికి శుక్రవారం పురిటి నొప్పులు వచ్చాయి. రోడ్డు సదుపాయం లేకపోవడంతో కుటుంబీకులు ఆమెను డోలిలో సుమారు రెండు కిలోమీటర్లు మోసుకుని వంజంగి గ్రామానికి చేరుకున్నారు. అక్కడి నుంచి 108 వాహనంలో ఆమెను స్థానిక ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలోని వైద్యుల పర్యవేక్షణలో ఆమె సురక్షితంగా ఉన్నారు.


గర్భిణి చినతల్లిని డోలిలో మోసుకువస్తున్న గిరిజనులు

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

విశాఖపట్నం, ఆగస్టు 2: వివిధ జోన్‌ల పరిధిలో నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేయగా, మరికొన్ని రైళ్లను మళ్లింపు మార్గంలో నడిపించనున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

రద్దైన రైళ్ల వివరాలు

నాగపూర్ డివిజన్‌లో నాన్ ఇంటర్ లాక్ నిర్మాణ పనుల కారణంగా ఈనెల 14న గాంధీధాం-పూరి ఎక్స్‌ప్రెస్ (22973), ఈనెల 17న పూరి-గాంధీధాం ఎక్స్‌ప్రెస్ (22974) రైళ్లను రద్దు చేశారు. సాంకేతిక కారణాలతో హౌరా-యశ్వంత్‌పూర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (02863) రైలును ఈనెల 8, 15వ తేదీల్లో రద్దు చేశామన్నారు.

మళ్లింపు మార్గంలో నడిచే రైళ్లు

సాలెం డివిజన్‌లో భద్రత, ఆధునికీకరణ పనుల నేపథ్యంలో ఆలెప్పీ-ధనబాద్ ఎక్స్‌ప్రెస్ (13352) ఈనెల 8,10, 13, 15, 17, 20, 22, 24, 27, 29 తేదీల్లో వయా పోదునూర్, ఇరుగూర్, సూరత్కల్ మీదుగా....ఎర్నాకులం-టాటానగర్ ఎక్స్‌ప్రెస్ (18190) ఈనెల 8, 10, 13, 15, 17, 20, 22, 24, 27, 29 తేదీల్లో వయా పోదునూర్, కోయంబత్తూర్, ఇరుగూర్ మీదుగా నడుస్తాయి. విశాఖ-నిజాముద్దీన్ (12807) సమతా ఎక్స్‌ప్రెస్ ఈనెల 6, 10, 11, 13, 14, 15, 18 తేదీల్లో వయా విజయవాడ, బల్లార్ష, నాగపూర్ మీదుగా, తిరుగు ప్రయాణంలోని నిజాముద్దీన్-విశాఖ (12808) సమతా ఎక్స్‌ప్రెస్ ఈనెల 8, 12, 13, 15, 16, 17, 20 తేదీల్లో నాగపూర్, బల్లార్ష, విజయవాడ మీదుగా రాకపోకలు సాగిస్తాయి. విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (22847) ఈనెల 18న విజయవాడ, బల్లార్ష, వర్ధా, భూసావల్ మీదుగా తిరుగు ప్రయాణంలోని ఎల్‌టీటీ-విశాఖ ఎక్స్‌ప్రెస్ (22848) ఈనెల 20, భూసావల్, వర్ధా బల్లార్ష, విజయవాడ మీదుగా నడుస్తాయి.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	80.00
లైవ్ ధర	100.00
విత్ స్కిన్	170.00
స్కిన్ లెస్	180.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

ఏయూలో గోల్‌మాల్

- ఓఎంఆర్ షీట్, బుక్‌లెట్‌ల కొనుగోళ్లలో అక్రమాలు
- అస్మదీయులకు కాంట్రాక్టు.. అదనంగా రూ.2 కోట్ల చెల్లింపు
- స్టేషనరీ, వైట్ పేపర్ వ్యవహారంలోనూ అదేతంతు
- తక్కువకు కోట్ చేసి టెండర్ దక్కించుకున్న
- కాంట్రాక్టర్‌ను పక్కనపెట్టి నేరుగా వ్యవహారం

ప్రస్తుత పాలకులు విచారణ జరిపించాలంటూ సర్వత్రా డిమాండ్

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):
ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గడిచిన ఐదేళ్లలో జరిగిన అడ్డగోలు వ్యవహారాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. గత పాలకులు వర్సిటీ నిధులను ఇష్టానుసారంగా దుర్వినియోగం చేశారన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. తాజాగా అటువంటి వ్యవహారం మరొకటి వెలుగులోకి వచ్చింది. యూనివర్సిటీలో ప్రింటింగ్ ప్రెస్‌ను మూసివేయించిన గత పాలకులు వర్సిటీకి కావాల్సిన ఓఎంఆర్ షీట్స్, బుక్ లెట్స్‌ను బయట నుంచి కొనుగోలు చేశారు. ఈ వ్యవహారంలో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఏటా వర్సిటీలో పరీక్షల నిర్వహణకు సుమారు 20 నుంచి 25 లక్షల వరకు ఓఎంఆర్ షీట్లు, బుక్‌లెట్లు అవసరమవుతాయి. ఇందుకు వర్సిటీ రెండు కోట్ల నుంచి రూ.2.5 కోట్లు చెల్లిస్తుంది. అయితే, 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి అదనంగా మరో రెండు కోట్ల రూపాయలు చెల్లించినట్టు తెలిసింది. ఓఎంఆర్ షీట్లు స్కానింగ్ చేయడంతోపాటు దానికి బుక్ లెట్ స్టిచింగ్ చేసినందుకు ఈ అదనపు మొత్తాన్ని చెల్లించినట్టు చెబుతున్నారు. ఈ చెల్లింపు వెనుక పెద్ద తతంగమే నడిచింది. ఇదిలావుంటే ఈ ఓఎంఆర్ షీట్లు, బుక్‌లెట్స్ సరఫరా చేసే కాంట్రాక్టును కూడా గత పాలకులు తమకు అస్మదీయులైన వారికి కట్టబెట్టినట్టు చెబుతున్నారు. గతంలో వర్సిటీలో ఉన్నతాధికారికి ఆత్మీయుడైన వ్యక్తికి ఈ కాంట్రాక్టును అప్పగించారు. దీనిపై ప్రస్తుత వీసీ పూర్తిస్థాయి విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని చెబుతున్నారు.

టెండర్ లేకుండా కొనుగోలు..

యూనివర్సిటీకి స్టేషనరీ, వైట్ పేపర్ సరఫరా చేసేందుకు టెండర్లు పిలుస్తుంటారు. గత వీసీ బాధ్యతలు చేపట్టిన తరువాత 2020లో టెండర్ పిలిచారు. ఈ టెండర్‌లో గడిచిన 30 ఏళ్లుగా వర్సిటీకి స్టేషనరీ, తెల్ల కాగితాలు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్ తక్కువకు కోట్ చేసి టెండర్ దక్కించుకున్నారు. రూ.15 లక్షలు విలువజేసే పెన్నులు, జిరాక్స్ పేపర్లు వంటి స్టేషనరీ, మరో 180 టన్నులు వైట్ పేపర్ సరఫరా చేయడానికి కాంట్రాక్టర్ ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే, ఈ టెండర్‌ను పక్కనపెట్టిన వర్సిటీ అధికారులు తమకు కావాల్సిన వ్యక్తి నుంచి వీటిని నేరుగా కొనుగోలు చేశారు. అలాగే, పేపర్ వాల్యూయేషన్ సమయంలో ప్రొఫెసర్లకు క్లాత్ లైన్ కవర్లు ఇస్తుంటారు. ఏటా సుమారు 50 వేల వరకు క్లాత్ లైన్ కవర్లు అవసరం అవుతాయి. వీటిని కూడా టెండర్లు లేకుండానే నాటి అధికారులకు కావాల్సిన వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్టు చెబుతున్నారు. గడిచిన నాలుగేళ్లుగా వీటిని టెండర్లు లేకుండానే కొనుగోలు చేస్తుండడం వెనుకున్న మర్మమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ప్రింటింగ్ ప్రెస్ ఎందుకు మూసివేసినట్టో..?

ఏయూలో ఏళ్ల తరబడి ఉన్న ప్రింటింగ్ ప్రెస్‌ను గత పాలకులు మూసివేశారు. దీనికి గల కారణాలను అప్పట్లో చెప్పలేదు. పరికరాలు పాడయ్యాయని, కొనుగోలు చేసేందుకు పెద్ద మొత్తంలో వెచ్చించాల్సి వస్తుందన్న కారణాలను చూపించారు. సుమారు 60 ఏళ్లకు పైబడి చరిత్ర కలిగిన ఈ ప్రెస్‌లోనే వర్సిటీకి కావాల్సిన ఓఎంఆర్ షీట్లు, బుక్‌లెట్లు, దూర విద్యకు సంబంధించి మెటీరియల్‌ను ప్రింట్ చేసేవారు. కానీ, సాంకేతిక ఇబ్బందులు, ఖర్చు పెరుగుతోందన్న కారణాన్ని చూపించి ప్రింటింగ్ ప్రెస్‌ను మూసేశారు. ఆ తరువాత తమకు కావాల్సిన వారికి కాంట్రాక్టులు అప్పగించుకుని ఇష్టానుసారంగా బిల్లులు చెల్లించినట్టు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయంటున్నారు. ఈ ప్రింటింగ్ ప్రెస్‌ను మూసేసిన తరువాత ఇక్కడ పనిచేసే సుమారు 18 మంది టెక్నికల్ సిబ్బందిని ఇతర విభాగాల్లో నాన్ టెక్నికల్ సేవల్లో వినియోగించుకుంటున్నారు.

భయపెడుతున్న తుఫాన్ షెల్టర్

- స్వయంభూవరంలో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మాణం
- ప్రస్తుతం శిథిలస్థితికి చేరిక
- ఖాళీ సమయాల్లో పాఠశాల, అంగన్‌వాడీ పిల్లలు అక్కడే ఆటలు
- ఎప్పుడు ఏం జరుగుతుందోనని తల్లిదండ్రులు హడల్

పరవాడ, ఆగస్టు 2: మండలంలోని కలపాక పంచాయతీ పరిధి స్వయంభూవరంలో గల తుఫాన్ షెల్టర్ భవనం కూలేందుకు సిద్ధంగా ఉంది. విపత్తుల సమయంలో ప్రజల సౌకర్యార్థం నిర్మించిన ఈ షెల్టర్ ప్రస్తుతం పూర్తిగా శిథిలమైంది. సుమారు నలభై ఏళ్ల క్రితం దీని నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం పూర్తిగా శిథిలం కావడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఈ భవనానికి సంబంధించిన గోడలు సగం వరకు పడిపోయాయి. దీంతో భవనం దుస్థితిని చూసి గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. దీనికితోడు పాఠశాల విద్యార్థులతో పాటు అంగన్‌వాడీ పిల్లలు ఖాళీ సమయంలో ఈ షెల్టర్ వద్దకు వెళ్లే ఆటలాడుతుంటారు. ఈ సమయంలో ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని వారి తల్లిదండ్రులు హడలిపోతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తుఫాన్ షెల్టర్‌ను కూల్చివేయాలని అంతా కోరుతున్నారు.


స్వయంభూవరంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న తుఫాన్ షెల్టర్

ఇప్పటికైనా మా గ్రామానికి రోడ్డు వేయండి

- సమస్య చెప్పేందుకే డోలీల్లో వెళ్లి పింఛన్లు తీసుకున్నాం
- అధికారులకు కొరుప్రోలు గ్రామ గిరిజనుల వినతి

రోలుగుంట, ఆగస్టు 2: తమ గ్రామానికి రహదారి సౌకర్యం కలగా మిగిలిందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు వేసేలా చర్యలు తీసుకోవాలని మండలంలోని ఎంకే పట్నం పంచాయతీ పరిధిలోని కొరుప్రోలు గ్రామ గిరిజనులు కోరారు. ఈ గ్రామానికి చెందిన వారు డోలీలపై గురువారం ఎం.కె. పట్నం వచ్చి పింఛన్లు అందుకున్నారంటూ మీడియాలో కథనాలు రావడంతో శుక్రవారం డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, తహసీల్దార్ సోమశేఖర్, ఎంపీడీవో వెంకటేశ్వరరావు తదితరులు ఈ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కొరుప్రోలు గిరిజనులు ఇన్నాళ్లూ తమ గ్రామానికి రోడ్డు లేక అవస్థలు పడుతూ వచ్చామన్నారు. అందుకే తమ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి ఎలాగైనా తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో పింఛన్లు అందుకునేందుకు డోలీలపై వెళ్లినట్టు చెప్పారు. తమ గ్రామానికి ఇప్పుడైనా అధికారులు రావడం ఆనందంగా ఉందన్నారు.

ఈ విధంగా తమ సమస్యను గుర్తించాలన్నారు. కేవలం ద్విచక్ర వాహనం మాత్రమే వచ్చే అవకాశం ఉన్న తమ గ్రామానికి రోడ్డు వేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. గత ఐదేళ్లలో కూడా తమ గ్రామానికి పింఛన్లు ఇవ్వడానికి ఎవరూ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మా గ్రామానికి రోడ్డు వేయాలని పీడీకి వినతిపత్రం అందించారు.


డీఆర్‌డీఏ పీడీ శచీదేవికి రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

ఎమ్మెల్సీ ఎన్నికలపై మాజీ మంత్రుల సమీక్ష

- హాజరైన బొత్స, బూడి తదితరులు

నక్కపల్లి, ఆగస్టు 2: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పేరు ఖరారైందన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నక్కపల్లిలో వైసీపీ నాయకులతో మాజీ మంత్రులు సమాలోచనలు జరిపారు. మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, బూడి ముత్యాల నాయుడు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఇక్కడికి విచ్చేశారు. వైసీపీ నేత వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు తదితరులు వారికి స్వాగతం పలికారు. అనంతరం మండలంలో, నియోజకవర్గంలో వైసీపీ తరఫున ఎంపీటీసీ సభ్యులు ఎంత మంది ఉన్నారు..? తదితర అంశాలపై వీసం రామకృష్ణతో చర్చించారు. మళ్లీ మూడు రోజుల్లో నక్కపల్లి వచ్చి అందరితో మాట్లాడతానని బొత్స చెప్పారు. అయితే ఆయన విలేకర్లతో మాట్లాడడానికి నిరాకరించారు. ధర్మం నాలుగుపాదాల నడుస్తుందంటారా..? అని బొత్స విలేకర్లను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, స్థానిక నాయకులు కొల్లాటి బుజ్జి, అల్లాడ కొండ, బంగార్రాజు, తళ్లా బార్గవ్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.


వైసీపీ నాయకులతో సమాలోచనలు చేస్తున్న మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, బూడి ముత్యాల నాయుడు

ఆధునిక పద్ధతిలో వరి సాగు

డ్రమ్‌సీటర్ ద్వారా వరినాట్లు

నాతవరం, ఆగస్టు 2: మండల కేంద్రం నాతవరంలో కొందరు రైతులు వరిసాగును ఆధునిక పద్ధతుల్లో చేస్తున్నారు. డ్రమ్‌సీటర్ ద్వారా వరినాట్లు వేస్తున్నారు. డ్రమ్‌సీటర్ ద్వారా ఎకరానికి సన్నరకం వరి విత్తనాలు 12 కిలోలు, ముద్దక రకం వరి విత్తనాలు ఎకరానికి 14 కిలోల వరి విత్తనాలు సరిపోతాయని రైతులు చెబుతున్నారు. ఈ విధానం ద్వారా వరిసాగు చేయడం వల్ల ఆకుపోత, ఆకుతీత పనులు ఉండవని, అలాగే కూలీల కొరత కొంత మేర తగ్గుతుందని రైతులు తెలిపారు. ఈ విధానం వల్ల ఎకరానికి రూ.5 వేలు పెట్టుబడి ఖర్చులు తగ్గుతున్నాయని చెప్పారు. దమ్ముపట్టి వరినాట్లు వేసి వ్యవసాయం చేస్తే ఎకరానికి ఈ ప్రాంతంలో 25 బస్తాలకు మించి రావడం లేదని, అదే డ్రమ్‌సీటర్ ద్వారా వరినాట్లు వేసి వ్యవసాయం చేస్తే ఎకరానికి 32 బస్తాల దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది చాలా మంది రైతులు ఈ విధానంలోనే వరినాట్లు వేసి సాగు చేస్తున్నారు.


నాతవరంలో డ్రమ్‌సీటర్ ద్వారా వరినాట్లు వేస్తున్న దృశ్యం

సభాపతిని కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు


స్పీకర్ అయ్యన్నపాత్రుడుని కలిసి బార్ అసోసియేషన్ ప్రతినిధులు

నర్సీపట్నం, ఆగస్టు 2: బార్ అసోసియేషన్ ప్రతినిధులు సభాపతి అయ్యన్నపాత్రుడును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గంజాయి కేసులకు ప్రత్యేకంగా కోర్టు ఏర్పాటు చేయాలని, జిల్లా స్థాయిలో బెంచ్ ఏర్పాటు, కోర్టు సముదాయం విస్తరణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్టా ప్రభాకర్, కార్యదర్శి అనిమిరెడ్డి శివకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ కోసూరి అప్పలనాయుడు, సీనియర్ న్యాయవాదులు కామిరెడ్డి సత్యనారాయణ, అప్పలనాయుడు, పొక్కునూరి నర్సింహం, లోకా లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు కింద జీతాలు

గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు కింద జీతాలు, పెన్షన్లు ఇవ్వాలని జిల్లా గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగులు సంఘం అధ్యక్షుడు కె.త్రిమూర్తులురెడ్డి, కార్యదర్శి జి.మురళీకృష్ణ సభాపతి అయ్యన్నపాత్రుడుకి వినతిపత్రం అందజేశారు. విశాఖపట్నంలో గ్రంథాలయ సంస్థకు చెందిన స్థలంలో భవనాలు నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రంథాలయ ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించాలని కోరారు.

రైల్వే స్టేషన్లను సందర్శించిన ఏడీఆర్ఎం

- అధికారులకు పలు సూచనలు


అనకాపల్లి స్టేషన్‌లో పట్టాలను పరిశీలిస్తున్న ఏడీఆర్ఎం శ్రీనివాసరావు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 2 : ఇక్కడి రైల్వే స్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే ఏడీఆర్ఎం శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. ముందుగా ఆయన అనకాపల్లికి సమీపంలోని తాడి రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేసిన అనంతరం మధ్యాహ్నం అనకాపల్లి రైల్వేస్టేషన్‌కు విచ్చేశారు. ముందుగా రైల్వే ట్రాక్, ప్లాట్‌ఫారాలను పరిశీలించి స్టేషన్ సూపరింటెండెంట్ సచ్చినివాస్‌కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అమృత్ భారత్ పథకంలో రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు వేగవంతం చేస్తున్నామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రైల్వే ట్రాక్ పటిష్టత పనులు జరుగుతున్నందున పలు రైళ్లు నిలిచినట్టు చెప్పారు. ఈ నెల పదో తేదీ తరువాత ప్రయాణికులకు ఆయా రైళ్లు అందుబాటులోకి రానున్నట్టు వివరించారు. ఆయన వెంట ఎస్ఎస్‌తో పాటు పలు విభాగాల అధికారులు ఉన్నారు.

రైవాడ జలాశయం నుంచి 150 క్యూసెక్కుల నీరు విడుదల


రైవాడ నీటిని ఆయకట్టుకు విడుదల చేస్తున్న అధికారులు

దేవరాపల్లి, ఆగస్టు 2: రైవాడ జలాశయం నుంచి ఆయకట్టు భూములకు ఎడమ, కుడి కాలువల నుంచి 150 క్యూసెక్కులు నీటిని శుక్రవారం విడుదల చేశారు. ఖరీఫ్ వరినాట్లు వేయడానికి జలాశయం పరిధిలో ఉన్న 15,344 ఎకరాల ఆయకట్టుకు ఎడమ కాలువ నుంచి 100 క్యూసెక్కులు, కుడి కాలువ నుంచి ఏభై క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు డీఈఈ సత్యంనాయుడు తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి, నీటి సంఘం ప్రతినిధులు, రైతులతో సమావేశమయ్యారు. రైతుల కోరిన విధంగా నీటిని విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు సూర్యనారాయణ, పోతల పాత్రునాయుడు, పూడి నారాయణమూర్తి, గొర్రుపోటు రామ్మూర్తినాయుడు, లెక్కల అవతారమూర్తి, రెడ్డి బలరాం, పోతలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అటల్ మారథాన్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థిలను అభినందిస్తున్న ఉమ్మడి విశాఖ జిల్లా గురుకులాల సమన్వయాధికారిణి రూపావతి

సబ్బవరం, ఆగస్టు 2: జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అటల్ మారథాన్ 2023-24లో సబ్బవరం గురుకుల విద్యాలయం విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థులు జె.సందీప్, ఎల్.మున్నా, గైడ్ టి.రాంబాబులను ఉమ్మడి విశాఖ జిల్లా గురుకులాల సమన్వయాధికారిణి రూపావతి శుక్రవారం ఇక్కడ అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అటల్ ఇన్నోవేషన్ మిషన్, నీతి ఆయోగ్ ఎంపిక చేసిన టాప్ 500 ప్రాజెక్టులలో తమ విద్యార్థులు రూపొందించిన నగరాల్లో పారిశుధ్య సమస్య పరిష్కారానికి డ్రైనేజ్ క్లీనింగ్ సిస్టమ్ ప్రాజెక్టు టాప్ 100లో ఎంపికైనట్టు చెప్పారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 50 వేల మంది విద్యార్థులు హాజరైనట్టు చెప్పారు. విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ సత్యారావు, ఉపాధ్యాయులు జానకీరామ్, చిరంజీవిరావు, ప్రభాకరరావు, తిరుపతిరావు, ఐసాక్ పాల్గొన్నారు.

సమస్యలపై ప్రజాప్రతినిధుల ధ్వజం

అన్ని శాఖల అధికారులను నిలదీసిన సభ్యులు

ఆర్‌అండ్‌బీ, పీఆర్, వైద్య, ఐసీడీఎస్ శాఖల అధికారుల తీరుపై మండిపాటు

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

అధికారులు జవాబుదారీగా ఉండాలి: జడ్పీ చైర్‌పర్సన్




సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు... మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు, ఆగస్టు 2: మండలంలోని సమస్యలపై ప్రజా ప్రతినిధులు ధ్వజమెత్తారు. భారీ వర్షాలతో వందలాది ఎకరాల్లో వరి, రాగులు తదితర పంటలు దెబ్బతిన్నాయని, పశువులు అధిక సంఖ్యలో మృతి చెందాయని, ఇళ్లు కూలిపోయాయని, అధికారులు అన్ని గ్రామాల్లో పర్యటించి బాధితులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే అన్ని శాఖల అధికారులను నిలదీశారు. దీంతో సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది.

మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ఎ.సీతమ్మ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని పలు చోట్ల రహదారులు, కల్వర్టులు దెబ్బతిన్నాయని పీఆర్, ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం అటుగా ఎందుకు తొంగిచూడడం లేదని సభ్యులు ప్రశ్నించారు. గ్రామాల్లో దోమల నివారణ మందు స్ప్రేయింగ్ పనులు సక్రమంగా చేపట్టడంలేదని, ఈ పనులకు సంబంధించి సర్పంచులకు సమాచారం కూడా ఇవ్వడంలేదని వైద్యులు, మలేరియా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీహెచ్‌సీలో గైనకాలజిస్టును నియమించాలని, పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. అలాగే సీహెచ్‌సీలో రోగులకు పెడుతున్న భోజనం అధ్వానంగా ఉంటుందని, మరుగుదొడ్ల గదులకు తలుపులు లేవని సభ్యులు ధ్వజమెత్తారు. ఎనిమిది మంది వైద్యులకు ఇద్దరు మాత్రమే ఉన్నామని, అయినప్పటికీ రోగులకు సకాలంలో సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని సీహెచ్‌సీ వైద్యాధికారి గీతాంజలిదేవి వివరణ ఇచ్చారు. అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న కోడి గుడ్లు ఎక్కువ శాతం కుళ్లిపోతున్నాయని, పలు గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలు కారిపోతున్నాయని, వాటి బాగోగులను ఎందుకు పట్టించుకోవడం లేదని సీడీపీవో రమాదేవిని సభ్యులు నిలదీశారు. గుడ్లు కుళ్లిపోతే వేరే గుడ్లు పంపిణీ చేస్తున్నామని, ఇతర సమస్యలపై గ్రామాలను సందర్శించి పరిష్కారానికి కృషి చేస్తానని పీవో వివరణ ఇచ్చారు.

విద్యా శాఖ అధికారులకు ప్రశ్నల వర్షం

బుంగాపుట్టు పంచాయతీ చుట్టుగొందిలో నాడు-నేడు నిధులతో చేపట్టిన పాఠశాల భవనం పనులు అసంపూర్తి నిలిచిపోయాయని, దీంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని, పెదగూడ, దారెల, మాకవరంగ, కుమడ, వనభసింగి, లక్ష్మీపురం, రంగబయలు తదితర పంచాయతీల పరిధిలో పాఠశాల భవనాలు లేక విద్యార్థులకు సమస్యలు ఎదురవుతున్నాయని, ఈ సమస్యను ఎన్నిసార్లు చెప్పినా ఎందుకు స్పందించడం లేదని ఎంఈవో కృష్ణమూర్తిని సభ్యులు ప్రశ్నించారు. అలాగే పలు చోట్ల ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడం లేదని, పలు చోట్ల విద్యార్థులు రాత్రి వేళల్లో బయట తిరుగుతున్నారని ఎంఈవో దృష్టికి సభ్యులు తీసుకువెళ్లారు. పాఠశాలల తీరుతెన్నులపై విద్యా శాఖ పర్యవేక్షణ కొరవడిందని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల-1లో చెట్లు నరికి విక్రయించగా వచ్చిన డబ్బులు దేనికి వెచ్చించారని, ఇంతకీ ఆ డబ్బులు ఎవరి వద్ద ఉన్నాయని ఏటీడబ్ల్యూవో స్వర్ణలతను సభ్యులు ప్రశ్నించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వద్ద ఉన్నాయని ఆమె సమాధానం చెప్పగా, ప్రభుత్వ డబ్బులు తమ వ్యక్తిగత ఖాతాల్లో ఎలా ఉంచుతారని ఆమెను నిలదీశారు. తక్షణమే విద్యార్థుల సౌకర్యార్థం ఆ సొమ్మును వినియోగించాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణం పనులు నత్తడకన సాగుతున్నాయని అయినప్పటికీ ఎందుకు పట్టించుకోవడంలేదని, కళాశాల భవన నిర్మాణం పనులు పూర్తయినా ఎందుకు ప్రారంభోత్సవానికి నోచుకోలేదని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులను సభ్యులు ప్రశ్నించారు. జర్రెల, బుంగాపుట్టు, కించాయిపుట్టు, లక్ష్మీపురం తదితర పంచాయతీల పరిధిలో పలు గ్రామాల్లో అసంపూర్తి పనులతో తాగునీటి పథకాలు ఉన్నాయని, కాలం ఏదైనా నీటి సమస్యను ఎదుర్కొంటున్నామని, ఈ విషయాన్ని చెప్పిన ఎందుకు స్పందించడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారును సభ్యులు అడిగారు. కించాయిపుట్టు, మినుములపుట్టు గ్రామాల్లో నూతనంగా లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన బోరింగులు పట్టుమని పది రోజులు కూడా పని చేయలేదని, ప్రజా ధనం వృథా అవుతుందని సభ్యులు ధ్వజమెత్తారు. మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతంలో చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తున్న గిరిజనులను మత్స్యకారులుగా గుర్తించాలని, వారికి వలలు, బోట్లు రాయితీపై అందించాలని, బోట్లు నడిపేందుకు డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇవ్వాలని సభ్యులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు వల్ల తెల్ల రేషన్ కార్డుదారులకు ఉచితంగా నిత్యావసర సరుకులను అందించాలని సభ్యులు కోరారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి సర్పంచులకు, ఎంపీటీసీ సభ్యులకు కనీసం సమాచారం అందించడంలేదని, ప్రొటోకాల్ పాటించకుండే ఎలా అని సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ అధికారులు జబాబుదారీగా ఉండాలని సూచించారు. ప్రజా ప్రతినిధులను కలుపుకుంటూ అభివృద్ధికి పాటుపడాలని చేయాలని కోరారు. సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కిరణ్‌కుమార్, ఎస్‌ఐ కె.రవీంద్ర, వైస్ ఎంపీపీలు భాగ్యవతి, సత్యనారాయణ, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సీలేరు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు ఏడీఈగా అప్పలనాయుడు బాధ్యతలు



ఏడీఈ అప్పలనాయుడు

సీలేరు, ఆగస్టు 2: సీలేరులో నూతనంగా నిర్మించే 1350 మెగా వాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు ఏడీఈగా టి.అప్పలనాయుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి డివిజన్-2లో ఏడీఈగా చేసిన అప్పలనాయుడును, జెన్‌కో ఉన్నతాధికారులు సీలేరు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు ఏడీఈగా నియమిస్తూ ఇటీవల ఉత్తరులు జారీ చేశారు. గురువారం డొంకరాయిలో కొత్త ఏడీఈ చేరడంతో, అక్కడ నుంచి రిలీవ్ అయ్యారు.

గంజాయికి దూరంగా ఉండాలి: సీఐ

జి.మాడుగుల, ఆగస్టు 2: గంజాయి వంటి మారక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సీఐ రమేశ్ సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం డగ్స్, గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉన్నత భావాలు అలవర్చుకోవాలని సూచించారు. సోషల్ మీడియాకు బానిస కాకుండా అధ్యాపకుల సూచనలు పాటిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని చెప్పారు. అనుమానిత వ్యక్తులకు వసతి గృహంలో ప్రవేశం కల్పించొద్దని, వారి గురించి సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్‌ఐ శ్రీనివాసరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి నివారణకు సహకరించాలి

గూడెంకొత్తవీధి, ఆగస్టు 2: గిరిజన ప్రాంతంలో గంజాయి నివారణకు ప్రజలు సహకరించాలని సీఐ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆపరేషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా గంజాయికి వ్యతిరేకంగా విద్యార్థులతో కలిసి పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి వల్ల యువకులు విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలు గంజాయి, సాగు రవాణాకు దూరంగా ఉండాలని సూచించారు. లేనిపక్షంలో క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఎస్‌ఐ అప్పలసూరి పాల్గొన్నారు.

రాయితీ ఎరువులు వినియోగించుకోండి

కొయ్యూరు, ఆగస్టు 2: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఉమాదేవి సూచించారు. మండలంలోని సింగవరం రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం యూరియా, ఎరువులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 50 కిలోల బ్యాగ్ రూ.267కు అందజేస్తున్నట్టు చెప్పారు. ఈ యూరియాను ఎకరానికి 25 కిలోల చొప్పున దమ్ములో వేసుకోవాలని సూచించారు.

పారిశుధ్యం మెరుగుకు కృషి

అనంతగిరి, ఆగస్టు 2: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు కృషిచేయాలని ఈవోపీఆర్డీ తోటరావు సూచించారు. కాశీపట్నం పంచాయతీ కేంద్రంలోని సచివాలయం వద్ద కార్యదర్శులు, సచివాలయం సిబ్బందితో శుక్రవారం ప్రత్యేక సమావేశం న్విహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టిసారించాలని, మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

లబ్ధిదారుల ఇళ్లకే రేషన్ అందించాలి

చింతపల్లి, ఆగస్టు 2: ఎండీఎం ఆపరేటర్లు లబ్ధిదారుల ఇంటి వద్దకే రేషన్ సరకులు అందజేయాలని తహసీల్దార్ టి.రామకృష్ణ ఆదేశించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో శుక్రవారం రేషన్ బియ్యం పంపిణీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లు రేషన్ సరకులను కచ్చితమైన తూకంతో ఇంటి వద్దకు తీసుకొని వెళ్లి అందజేయాలన్నారు. బియ్యం పంపిణీలో కోత విధించినా, తూనికల్లో మోసం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. రేషన్ కార్డు ఆధారంగా సంబంత కుటుంబానికి పూర్తి స్థాయిలో బియ్యం పంపిణీ చేయాలన్నారు. అలాగే ప్రతీ నెల 10వ తేదీలోపు రేషన్ బియ్యం అందించాలని స్పష్టం చేశారు.

ఉపాధి బకాయిలు తక్షణమే చెల్లించాలి

అరకులోయ, ఆగస్టు 2: జిల్లాలో ఉపాధి కూలీలకు తొమ్మిది వారాలుగా బకాయిపడ్డ వేతనాలను తక్షణమే చెల్లించాలని ఉపాధి హామీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ (సిఐటియూ) ప్రధాన కార్యదర్శి ఎస్.బి.పోతురాజు, గౌరవ అధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పనులు చేసి తొమ్మిది వారాలు గడిచిపోతున్నా వేతనాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. జిల్లాలో రూ.4.5 లక్షల మంది కూలీలు పనులు చేస్తున్నారని, వారికి సకాలంలో కూలి చెల్లించకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి తొమ్మిది వారాల కూలి మొత్తం విడుదల చేయాలని వారు కోరారు.

స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలి

▸▸ కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశం

▸▸ చిత్తశుద్ధితో పనిచేసిన వారి పేర్లనే అవార్డులకు సిఫారసు చేయాలని సూచన




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్... పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

పాడేరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈ ఏడాది స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. జెండా పండగ నిర్వహణపై ఐటీడీఏ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో స్వాతంత్ర్య వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను చేయాలని, ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. అలాగే అవార్డులకు గౌరవం పెరిగేలా చిత్తశుద్ధితో పనిచేసిన వారి పేర్లను మాత్రమే సిఫారసు చేయాలని ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. పిల్లల్లో దేశభక్తిని పెంచేలా సంస్కృతికి కార్యక్రమాలను ఏర్పాటుచేయాలని, ఈ వేడుకలకు జిల్లాలోని ప్రముఖులు, స్వాతంత్ర సమరయోధుల కుటుంబీకులు, ప్రజలను ఆహ్వానించాలని ఆయన ఆదేశించారు. వర్షం వచ్చిన వేడుకలకు అంతరాయం కలగకుండా వాటర్ ప్రూఫ్ టెంట్‌లను ఏర్పాటు చేయాలన్నారు.

శకటాలను పాడేరులో ఊరేగించాలి

స్వాతంత్ర్య వేడుకల్లో ఏర్పాటు చేసిన వివిధ శకటాలను పాడేరు పట్టణంలో సైతం ఊరేగించాలని జిల్లా కలెక్టర్ దినేశ్ కుమార్ సూచించారు. ఈ వేడుకల్లో డీఆర్‌డీఏ, డ్వామా, వ్యవసాయ, ఉద్యానవన, కాఫీ, వైద్యారోగ్యం, పర్యాటకం, అటవీ, తదితర శకటాలను ఆకర్షణీయంగా రూపొందించాలన్నారు. వేడుకల్లో భాగంగా స్టేజ్, మైక్, ఇతర ఏర్పాట్లను పక్కాగా చేయాలని, ఎవరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. అలాగే ఆయా శాఖల ప్రగతి నివేదికలను ఈ నెల 5వ తేదీ నాటికి తమకు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో అభిషేక్, డీఆర్‌వో పద్మావతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పాడేరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో వివిధ శాఖల అధికారలతో కలిసి జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ శుక్రవారం తల్లిపాల వారోత్సవాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అభిషేక్, డీఆర్‌వో పద్మావతి, డీఎంహెచ్‌వో జమీల్ బాషా, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నూతన అంబులెన్స్ ప్రారంభోత్సవం

పాడేరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి హిందుస్థాన్ పెట్రోలియమ్ లిమిటెడ్ వితరణగా అందించిన అంబులెన్స్‌ను జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ శుక్రవారం పచ్చజెండా ఊపి లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా అంబులెన్సు లోపల కల్పించిన సదుపాయాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అభిషేక్, డీఆర్‌వో పద్మావతి, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి జమాల్‌బాషా, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం

పాడేరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు హర్షణీయమని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెనుమాక రవికుమార్ మాదిగ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని విధాలా ఎంతో అన్యాయానికి గురిన తమకు ఇన్నాళ్లకు న్యాయం జరిగిందన్నారు. అలాగే తమకు న్యాయం చేయాలనే లక్ష్యంతోనే సీఎం చంద్రబాబు వర్గీకరణకు అనుకూలంగా ఎంతో కృషి చేశారని చెప్పారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా మత్స్యమాడుగులమ్మ పండగ

జి.మాడుగుల, ఆగస్టు 2: మండలంలోని రేరోడివలసలో వెలిసిన మత్స్యమాడుగులమ్మ పండగను శుక్రవారం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మత్స్యరాస మత్స్యరాజు ఆధ్వర్యంలో జరిగిన పండగలో సంతబయలు, పీజీ.మాడుగుల గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

శివలింగపురం ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

అనంతగిరి, ఆగస్టు 2: శివలింగపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి జ్ఞానేశ్వరి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందలను పంపిణీ చేశారు. అనంతరం వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

బొత్స ఎంపికపై గరంగరం

... 5వ పేజీ తరువాయి

స్తోమత లేకపోవడంతో మిన్నకున్నారు. ఏమి చేసినా తాము ప్రశ్నించలేమనే ధీమాతోనే అధిష్ఠానం ఇప్పుడు బొత్సను ఎంపిక చేసిందని నాయకులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ఆశావాహులు ఎంతోమంది...

ఉమ్మడి విశాఖ జిల్లాలోని వైసీపీలో అనేక మంది సీనియర్ నాయకులు ఉన్నారు. తాజా మాజీ మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్‌లు ఈ ఎమ్మెల్సీ సీటును బలంగా కోరుకున్నారు. అలాగే ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా పోటీ చూసి ఊహించని విధంగా క్రాస్ ఓటింగ్ వల్ల ఓడిపోయిన మత్స్యకార నాయకుడు కోలా గురువులు కూడా ఈ సీటు తనకే వస్తుందని భావించారు. ప్రస్తుతం ఆయన విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షునిగా ఉన్నారు. అలాగే అనకాపల్లి జిల్లాలో కరణం ధర్మశ్రీ రెండుసార్లు ఎమ్మెల్యేగా చేశారు. విప్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. భీమిలి నుంచి పోటీ చేసి ఓడిపోయిన మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎస్టీ సామాజిక వర్గం నుంచి మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్, పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలోని కోటవురట్ల మండలంలో మాజీ ఎమ్మెల్సీ సూర్యానారాయణరాజు, గాజువాక నియోజక వర్గంలో చింతలపూడి వెంకట్రామయ్య, విశాఖ ఉత్తర నియోజకవర్గంలో రెండు సార్లు పోటీ చేసి ఓడిపోయిన కేకే రాజు...ఇలా పార్టీలో చాలా మంది ఎమ్మెల్సీ టికెట్ ఆశించారు. కానీ వీరందరినీ కాదని పక్క జిల్లా విజయనగరానికి చెందిన బొత్సను తీసుకువచ్చి అభ్యర్థిగా ప్రకటించారు. ఇది విశాఖ జిల్లా నాయకులను అవమానించినట్టేనని ఆ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు విజయనగరం జిల్లాలో పదవులన్నీ బొత్స కుటుంబానికే కట్టబెట్టారని, పార్టీ ఓడిపోయిన తరువాత కూడా ఆ కుటుంబం హవానే సాగాలనే ధోరణి అధిష్ఠానంలో కనిపిస్తున్నదని, అయితే అది ఆ జిల్లాకే పరిమితమైతే బాగుండేదని, పొరుగు జిల్లాకు తీసుకువచ్చి ఆయన నాయకత్వాన్ని రుద్దడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎంతమంది పార్టీ అభ్యర్థి విజయానికి మనస్ఫూర్తిగా పనిచేస్తారనేది అనుమానమే.

డోలీ మోతలకు పరిష్కారమెన్నడో?

... 5వ పేజీ తరువాయి

సంగతులు. దేవుడిపై భారం పెట్టుకుని కొండ కోనల్లోంచి రోడ్డు ప్రాంతాలకు రావాల్సిన పరిస్థితి మన్యం గిరిజనులది. అందువల్లే ఏజెన్సీలో నిత్యం ఏదో ప్రాంతంలో గర్భిణిని డోలీల్లో మోసుకు వస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అదృష్టవశాత్తూ వారంతా కొన్ని మార్లు క్షేమంగా గమ్యం చేరుకోగా.. దురదృష్టం వెంటాడి పలువురు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు అనేకం ఉన్నాయి.

ఐదేళ్లలో రోడ్లపై దృష్టిపెట్టని వైసీపీ సర్కార్

ఏజెన్సీలోని రోడ్ల నిర్మాణం కంటే పెద్ద అభివృద్ధి మరొకటి లేదు. కానీ వైసీపీ ప్రభుత్వం అధికారం ఉన్న ఐదేళ్లలో గిరిజన ప్రాంతంలో రోడ్ల నిర్మాణంపై కనీసం దృష్టి సారించలేదు. దీంతో మారుమూల ప్రాంతాలకు రోడ్లు లేని పరిస్థితి కొనసాగుతున్నది. గతంలో 'మిషన్ కనెక్ట్ పాడేరు' పేరిట అధికారులు మారుమూల ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని భావించారు. అందులో భాగంగా తొలి విడతగా రూ.273 కోట్లతో 454 రోడ్ల నిర్మాణానికి చర్యలు ప్రారంభించారు. కానీ వైసీపీ ప్రభుత్వం అందుకు నిధులు విడుదల చేయకపోవడంతో మిషన్ కనెక్ట్ పాడేరులో భాగంగా చేపట్టిన రోడ్ల నిర్మాణాలు ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. దీంతో గిరిజనులకు రోడ్డు, రవాణా అందని ద్రాక్షగా మారింది.

గిరి ప్రాంతాల్లో రోడ్లపై కూటమి సర్కారు ప్రత్యేక శ్రద్ధ

గిరిజన ప్రాంతాల్లో రోడ్డు, రవాణా సదుపాయాల కల్పనపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నది. ప్రధానంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సైతం గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అమరావతిలో జూలై 30వ తేదీన జరిగిన గిరిజన సంక్షేమ శాఖ సమావేశంలో దశల వారీగా గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టాలని, ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పటిష్ఠంగా అమలుచేయాలని మంత్రిని, అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ముఖ్యంగా గర్భిణులకు ఇబ్బందులు తలెత్తకుండా వసతి గృహాలు ఏర్పాటు చేయాలని, డోలి మోతలు లేకుండా మారుమూల ప్రాంతాలకు రోడ్లు నిర్మించాలని ఆయన సూచించారు. అలాగే ఏజెన్సీలోని తాజా పరిస్థితులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.కన్నబాబు గురువారం పాడేరు విచ్చేసి, ఐటీడీఏ, వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏజెన్సీలో రోడ్డు, రవాణా సదుపాయాల లేని గ్రామాలను గుర్తించాలని, ఆయా ప్రాంతాలకు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే రానున్న రోజుల్లో ఏజెన్సీలో డోలి మోతలు లేకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని కన్నబాబు పేర్కొన్నారు. తాజా పరిణామాలతో గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, రవాణా సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతపై గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆదివాసీలకు ఎన్నాళ్లీ కష్టాలు

... 5వ పేజీ తరువాయి

కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆ పంచాయతీ పరిధిలోని వాగులు, మత్స్యగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అయినప్పటికీ ఆమె భర్త దొబులు, గ్రామస్థులు లక్ష్మణ్, సురేష్, రామ్మూర్తి తదితరుల సహకారంతో పల్లకిపై దొరగూడ గ్రామం నుంచి జోరు వానలో ఎనిమిది కిలోమీటర్లు కాలినడకన, రెండు గెడ్డలు దాటించి రోడ్డు మార్గానికి చేరుకున్నారు. మార్గ మధ్యలో దొరగూడ, ఉబ్బెంగుల గ్రామాల సమీపంలో రెండు వాగులను దాటించారు. బాధిత మహిళను రోడ్డు మార్గానికి తీసుకువచ్చి అక్కడ నుంచి 108 అంబులెన్స్‌లో ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వెంటనే వైద్యాధికారి గీతాంజలి బాధిత మహిళకు వైద్య సేవలను అందించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, భయపడాల్సిన అవసరం లేదని ఆమె తెలిపారు. తమ గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం లేకపోవడంతో అత్యవసర సమయాల్లో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు.

డోలి సహాయంతో గర్భిణిని తరలింపు

లక్ష్మీపురం పంచాయతీ కెందుగూడ గ్రామానికి చెందిన గర్భిణి వంతాల నబిన (34)కి పురిటి నొప్పులు రావడంతో శుక్రవారం రెండు కిలోమీటర్లు కాలినడకన డోలి సహాయంతో ఒక గెడ్డను దాటించి ప్రధాన రహదారి వద్దకు తీసుకువచ్చారు. అక్కడ నుంచి అంబులెన్స్‌లో లబ్బూరు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె వైద్య సేవలు పొందుతున్నది.

ప్రకృతి అందాలు చూడాలంటే ఫీట్లు చేయాల్సిందే..!

... 5వ పేజీ తరువాయి

జారిపోతున్నాయి. ద్విచక్రవాహనాలు సైతం అతి కష్టంపై వ్యూపాయింట్ వద్దకు వెళుతున్నాయి. దీంతో ప్రస్తుతం చెరువులవేనం సందర్శించే పర్యాటకుల సంఖ్య పూర్తిగా పడిపోయింది. చెరువులవేనం గ్రామానికి చెందిన ఆదివాసీలు సైతం పొరుగు గ్రామాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

ఊరించి..ఉసూరుమనిపించిన వైసీపీ ప్రభుత్వం

చెరువులవేనం వ్యూపాయింట్ వద్దకు తారు రోడ్డు నిర్మాణం చేపడతామని వైసీపీ నాయకులు మూడేళ్లుగా ఊరించి ఉసూరుమనిపించారు. ప్రతి ఏడాది పర్యాటక సీజన్ ప్రారంభం కాగానే పర్యాటకులు, స్థానిక ఆదివాసీలు రహదారి సమస్యను వైసీపీ నాయకుల దృష్టికి తీసుకు వెళ్లడం, వెంటనే తారు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని ప్రకటించడం పరిపాటిగా మారిపోయింది. ఈ గ్రామానికి కనీసం మూడేళ్లలో వైసీపీ ప్రభుత్వం మెటల్ రోడ్డు నిర్మాణం కూడా పూర్తి చేయలేదు. దీంతో తారు రోడ్డు నిర్మాణం వైసీపీ నాయకుల హామీలు నీటిమూటలయ్యాయని పర్యాటకులు, ఆదివాసీలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

☛ సంక్షిప్తంగా..

శాకంబరిగా ముత్యాలమ్మ



చింతపల్లి, ఆగస్టు 2: మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాడ మాసం పురస్కరించుకుని శుక్రవారం ముత్యాలమ్మను భక్తులు కూరగాయలతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో హెచ్‌డబ్ల్యూవో పసుపులేటి వినాయకరావు, వర్తక సంఘం ప్రతినిధులు జోగేశ్వరరావు, పెదిరెడ్ల బేతాళుడు, నాయకులు రమేశ్, నాగేశ్వరరావు, రమణమూర్తి, ఆలయ కమిటీ సభ్యుడు సుర్ల వీరేంద్ర పాల్గొన్నారు.

జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

చింతపల్లి, ఆగస్టు 2: జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలిక పాటి వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి శుక్రవారం తెలిపారు. ఈ నెల 7వ తేదీ వరకు పాడేరు, అరకు, చింతపల్లి, రంపచోడవరం డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా ఆరు మిల్లీమీటర్లు, గరిష్ఠంగా 18 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందన్నారు. వాతావరణం తేమ, మబ్బులతో ఉంటుందన్నారు. వర్షాల వల్ల పంటల్లో తెగుళ్ల ఉధృతి ఉంటుందని, వర్షాలు తగ్గిన వెంటనే రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు.

విధుల్లోకి తీసుకోరూ...

▸▸ జిల్లా కలెక్టర్‌కు వలంటీర్లు వినతి

పాడేరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తమను విధుల్లోకి తీసుకోవాలని గిరిజన ప్రాంత గ్రామ వలంటీర్లు జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్‌ను శుక్రవారం కోరారు. వలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్మా రాంబాబు ఆధ్వర్యంలో గిరిజన ప్రాంత వలంటీర్లు ఐటీడీఏ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. ప్రజలకు సేవలందించామని, గత ప్రభుత్వం ఒత్తిడితోనే రాజీనామాలు చేశామని, గత రెండు నెలలుగా తమ పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యపై సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టిసారించి న్యాయం చేయాలని వారు కోరారు.

వాగు ఉధృత ప్రవాహంతోనే డోలిమోతతో తరలించారు

▸▸ డీఎంహెచ్‌వో జమీల్ బాషా

సీలేరు, ఆగస్టు 2: ధారకొండ పంచాయతీ నిమ్మచెట్టు గ్రామానికి చెందిన పాంగి గోపన్న (60)ను వాగు ఉధృతంగా ప్రవహించడంతోనే డోలిలో ఆస్పత్రికి తరలించారని డీఎంహెచ్‌వో జమీల్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. 'తప్పని డోలి మోత' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' గురువారం వెలువడిన కథనానికి ఆయన స్పందించారు. ఆసుపత్రికి సమాచారం వచ్చిన వెంటనే ఫీడర్ అంబులెన్సు ఆ గ్రామానికి వెళ్లిందని, కానీ గ్రామ శివారులో వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న కారణంగా వేరే మార్గం లేక డోలి కట్టి పాంగి ప్రవహిస్తున్న వాగు దాటించి అప్పటికే సిద్ధంగా ఫీడర్ అంబులెన్సులో ధారకొండ పీహెచ్‌సీకి తరలించారని చెప్పారు. అతన్ని వైద్యులు పరీక్షించగా గొంతులో వాపు, కాయలు ఉండడంతో ఆహారం తీసుకోలేకపోతున్నాడని గుర్తించి ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేయగా, వారు నిరాకరించారని చెప్పారు. గ్రామంలోనే పసరు మందులు వేయడంతో గోపన్న మృతి చెందినట్టు ఆయన తెలిపారు.

రక్షిత నీటి పథకాల క్లోరినేషన్

చింతపల్లి, ఆగస్టు 2: మండలంలోని తమ్మంగుల పంచాయతీ పరిధిలో రక్షిత నీటి పథకాలు, బావులు క్లోరినేషన్ చేయిస్తున్నట్టు సర్పంచ్ సలిమితి లక్ష్మయ్య తెలిపారు. శుక్రవారం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో సచివాయలం ఉద్యోగులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది మంచి నీటి పథకాలను శుభ్రం చేసి క్లోరినేషన్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షాలు అధికంగా కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు అదుపు చేసేందుకు పారిశుధ్యం మెరుగు పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అన్వర్, కార్యదర్శి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు మొరాయింపు



కె.కోడాపల్లి వద్ద నిలిచిపోయిన పాడేరు-చింతపల్లి బస్సు... రోడ్డు పక్కనే ఉన్న ప్రయాణికులు

జి.మాడుగుల, ఆగస్టు 2: పాడేరు నుంచి చింతపల్లి వెళ్లే ఆర్టీసీ బస్సు శుక్రవారం కె.కోడాపల్లి వద్ద సాంకేతిక కారణాలతో మొరాయించింది. చింతపల్లి వరకు రోజు మధ్యాహ్నం రాకపోలకు సాగించిన ఈ బస్సు అనంతరం ప్రయాణికులతో నిలిచిపోయింది. గత్యంతరం లేక ప్రైవేటు జీపులను ప్రయాణికులు ఆశ్రయించి గమ్య స్థానాలకు వెళ్లారు.

గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి

▸▸ టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రతినిధి బలరామ్

గూడెంకొత్తవీధి, ఆగస్టు 2: ఈకేవైసీ పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ప్రైవేటు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులపై జిల్లా కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఎస్టీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి కొర్ర భలరామ్ డిమాండ్ చేశారు. 'గ్యాస్ ఈకేవైసీ పేరిట దోపిడి' అనే శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'తో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన, సర్పంచ్ సుభద్ర, ఎన్‌డీఏ కూటమి నాయకులతోకలిసి గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాన్ని సందర్శించారు. గ్యాస్ కార్యాలయం, గోదాము మూసి ఉండడం, వచ్చే మంగళవారం వరకు కార్యాలయం తెరవబడదని గోడకు ప్రకటన అంటించడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు నగదును దోచుకుంటున్నారన్నారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల అక్రమ వసూళ్లతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రీమల రాజేశ్వరి పాల్గొన్నారు.